
# జోన్లవారీగా రూట్‌మ్యాప్




## వేదికను సులువుగా చేరేలా ప్రణాళికలు
## పార్కింగ్ కోసం ప్రత్యేకంగా 5 జోన్లు
## ఉమ్మడి జిల్లాల వారీగా రోడ్ మ్యాప్
## బీఆర్ఎస్ సభకు పకడ్బందీ ఏర్పాట్లు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభా ప్రాంగణానికి సులువుగా చేరుకునేలా జోన్లవారీగా రూట్ మ్యాప్‌లను సిద్ధం చేశారు. లక్షలాదిగా తరలి వచ్చే బీఆర్ఎస్ బంధుగణం కోసం 5 జోన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా జోన్ల వారీగా ప్రత్యేకంగా 5 పార్కింగ్ జోన్లను సైతం సిద్ధంచేశారు. వాటిని ముందుగానే అత్యంత పకడ్బందీగా సిద్ధంచేశారు. సభా ప్రాంగణానికి మొత్తం నాలుగు రహదారుల గుండా వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. అందులో మూడు జాతీయ రహదారులు (వరంగల్, సిద్దిపేట, కరీంనగర్) సహా సభ జరిగే చింతలపల్లికి చేరుకునేలా ధర్మసాగర్ నుంచి వచ్చే మరో రూట్‌ను కూడా సిద్ధం చేశారు. జిల్లాల వారీగా రూట్‌మ్యాప్‌ల వివరాలు కింది విధంగా ఉన్నాయి.

**వరంగల్ నుంచి :** ఇది 163వ జాతీయ రహదారి. ఈ రూట్ గుండా వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలు సహా హైదరాబాద్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు వచ్చే అవకాశం ఉన్నది.



ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సిద్ధమవుతున్న వేదిక

**సిద్దిపేట-హుస్నాబాద్ నుంచి:** ఇది 765వ డీజీ జాతీయ రహదారి. ఈ రూట్ నుంచి మెదక్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలు సహా వెస్ట్ ఆదిలాబాద్ (ఆదిలాబాద్, నిర్మల్, బోథ్, ఖానాపూర్ నియోజక వర్గాలు) నుంచి కార్యకర్తలు వస్తారు.

**కరీంనగర్ రూట్ :** ఇది 563వ జాతీయ రహదారి. ఈ రూట్ గుండా ఉమ్మడి కరీంనగర్, ఈస్ట్ ఆదిలాబాద్ (సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, కొంత పరకాల నియోజకవర్గాలు) నుంచి కార్యకర్తలు తరలివస్తారు.

**ధర్మసాగర్ రూట్:** ధర్మసాగర్ నుంచి చింతలపల్లి సభ జరిగే ప్రాంగణానికి అనుకుని ఉన్న రోడ్డు ఇది. ఈ రూట్ నుంచి స్టేషన్ ఘనపూర్, జనగామ నియోజకవర్గాల నుంచి వాహనాలు వచ్చే అవకాశం ఉన్నది.

### ఐదు పార్కింగ్ జోన్లు

**జోన్ 1:** నేషనల్ హైవే 163 మీదుగా గుడెప్పాడ్, ఆరేపల్లి, హసన్‌పర్తి, ఎల్లాపూర్ వైపు నుంచి వచ్చే వాహనాలతోపాటు మరో రూట్ అయిన హసన్‌పర్తి, ఎల్లాపూర్ మీదుగా ఈ పార్కింగ్ స్థలానికి చేరుకునే అవకాశం ఉన్నది. మరోవైపు కాకతీయ యూనివర్సిటీ క్రాస్ రోడ్ వరకు వివిధ మార్గాల ద్వారా చేరుకున్న వాహనాలు హసన్‌పర్తి, ఎల్లాపూర్ మీదుగా ఈ జోన్-1 పార్కింగ్‌కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

**జోన్ 2:** కరుణాపురం, దేవన్నపేట, మడిపల్లి అనంతసాగర్ మీదుగా ఈ పార్కింగ్ చేరుకునే అవకాశం ఉన్నది. మరో రూట్ అయిన వరంగల్‌లోని నాయుడు పెట్రోల్ పంప్, భట్టుపల్లి, కడిపికొండ ఆర్‌వోబీ, మడికొండ మీదుగా దేవన్నపేట, మడిపల్లి, అనంతసాగర్ నుంచి ఈ పార్కింగ్ జోన్-2కు చేరుకునేలా ఏర్పాట్లుచేశారు. మరో వైపు చింతగట్టు, జయగిరి, అనంతసాగర్ మీదుగా కూడా జోన్-2కు చేరుకోవచ్చు.

**జోన్ 3:** ధర్మసాగర్ మీదుగా దేవునూరు, దామెర, చింతలపల్లి నుంచి వచ్చే వాహనాలు పార్కింగ్ చేసుకునేలా జోన్-3లో ఏర్పాట్లు చేశారు.

**జోన్ 4:** కరీంనగర్ జాతీయ రహదారి 563 మీదుగా వచ్చే వాహనాలు హుజూరాబాద్, కోతులనడుమ, గ్రానైట్ క్వారీ మీదుగా ఈ పార్కింగ్ జోన్-4కు వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లుచేశారు.

**జోన్ 5:** సిద్దిపేట జాతీయ రహదారి 765(డీజీ) మీదుగా సిద్దిపేట, హుస్నాబాద్, ముల్కనూరు, గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్, ఇందిరానగర్ మీదుగా ఈ పార్కింగ్ జోన్-5కు చేరుకునేలా ఏర్పాట్లుచేశారు. మరో రూట్‌లో వేలేరు, కొత్తకొండ, ముత్తారం వైపు నుంచి పార్కింగ్ జోన్-5కు చేరుకునేలా ఏర్పాట్లు ఉన్నాయి. మరో రూట్ అయిన కరీంనగర్ మీదుగా వచ్చే వాహనాలు కోతులనడుమ మీదుగా దారి మళ్లించుకుని గోపాల్‌పూర్, గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్, సిద్దిపేట జాతీయ రహదారి మీదుగా ఇందిరానగర్ నుంచి పార్కింగ్ జోన్-5కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

# దశ, దిశ చూపేలా రజతోత్సవ సభ

- కేసీఆర్ సందేశం కోసం యావత్ తెలంగాణ ఎదురుచూస్తోంది
- దేశ భద్రత విషయంలో సంపూర్ణ మద్దతు
- మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్



హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తేతెలంగాణ): రాష్ట్రానికి దశ, దిశ చూపేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభను నిర్వహిస్తామని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే పీ శశిధర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, నాయకులు పట్నం మాణిక్యం, సీ కల్యాణ్‌రావుతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. హన్మకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో కనీవిని ఎరుగని రీతిలో సభా ప్రాంగణం సిద్ధం చేస్తున్నామని, సభకు తరలివచ్చే వారికి ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 3వేల బస్సులను బుక్ చేశామని, వీటికి అదనంగా ప్రైవేట్ వాహనాలను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఇంటిపార్టీ పండుగకు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని కోరారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ఆవిర్భవించిన పార్టీ, 25వ వసంతంలోకి అడుగుపెట్టడం గొప్ప విషయమని చెప్పారు. గతంలో ఇచ్చిన ప్రతి హామీని పార్టీ అధికారంలోకి వచ్చాక అధినేత కేసీఆర్ చేసి చూపించారని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అడగడుగునా విఫలమైందని విమర్శించారు. రజతోత్సవ సభా వేదికగా కేసీఆర్ సందేశం కోసం యావత్ తెలంగాణ ప్రజానీకం ఉత్కంఠ, ఉత్సుకతతో ఎదురుచూస్తున్నదన్నారు.

### దేశ భద్రత విషయంలో సంపూర్ణ మద్దతు

పహల్గామ్ ఘటనతో ఉగ్రవాద వికృతరూపం మరో సారి బట్టబయలైందని, ముష్కరుల మారణహోమం దారుణమని ఖండించారు. యావత్ సమాజం ఇలాంటి దేశ విద్రోహ చర్యలను ముక్తకంఠంతో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. దేశ భద్రతకు కేంద్రం తీసుకునే ప్రతిచర్యకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. గతంలో కేసీఆర్ సూచనమేరకు అఖిలపక్ష బృందంతో కలిసి కశ్మీర్‌లో పర్యటించానని గుర్తు చేసుకున్నారు. అక్కడి ప్రజలు మతపరమైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, శాంతియుత జీవనాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తూ అమాయకులను పొట్టనబెట్టుకోవడం హేయమన్నారు. అంతర్జాతీయంగా ఆ దేశాన్ని ఒంటరి చేయాల్సిన సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. ఈ దిశగా కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

- సభా ఏర్పాట్ల పరిశీలన



ఎల్కతుర్తి, ఏప్రిల్ 24 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను గురువారం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిపై ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సభావేదిక, హెలిప్యాడ్‌లు, తమ నియోజకవర్గాలకు కేటాయించిన పార్కింగ్ స్థలాలను పరిశీలించారు.



హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, గ్యాదరి బాలమల్లు

# తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ శ్రీరామరక్ష

- ఓట్లు రావాలని కోరునేది కాంగ్రెస్, బీజేపీ నాయకులు
- తెలంగాణ బాగుండాలనేది బీఆర్ఎస్ నాయకులు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్ల పరిశీలన

వరంగల్, ఏప్రిల్ 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ ప్రజలకు ఎల్లప్పుడూ బీఆర్ఎస్‌తోనే శ్రీరామరక్ష అని ఎమ్మెల్సీ కల్వకుంట కవిత అన్నారు. తెలంగాణ రాష్ట్రం బాగుండాలని బీఆర్ఎస్ నాయకులు కోరుకుంటే.. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓట్లు మాత్రమే కోరుకుంటారని చెప్పారు. కాంగ్రెస్ ది చేతగాని ప్రభుత్వమని ప్రజలకు తెలిసిపోయిందని, 16 నెలల పాలనలో 16 పనులు కూడా కాలేదని ఆరోపించారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లను కవిత గురువారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రజల విజయాన్ని ప్రపంచానికి చాటడానికే బీఆర్ఎస్ రజతోత్సవ సభ అని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని, ఓర్వలేని కాంగ్రెస్ నేతలు మాట్లాడే మాటలను ప్రజలు క్షమించరని అన్నారు. తెలంగాణ అస్తిత్వం కోసం 2001లో కేసీఆర్ పిడికిలి బిగించి ఉద్యమాన్ని మొదలుపెట్టారని గుర్తు చేశారు. ఒక చుక్క రక్తం చిందించకుండా శాంతియుత మార్గంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ధీరుడు కేసీఆర్ అని చెప్పారు. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ నవయువకుల కోసం జరుగుతున్నదని, సభకు యువత పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కుంభమేళా తరహాలో రజతోత్సవ సభ జరగబోతున్నదని చెప్పారు.

### మహిళా సాధికారతకు కేసీఆర్ బాటలు

మహిళా సాధికారతకు కేసీఆర్ బాటలు వేశారని కవిత పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో, మార్కెట్ కమిటీల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. మహిళలకు నెలకు రూ.2500, తులం బంగారం, స్కూటీలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన ప్రతిఒక్కరు సభకు రావాలని కోరారు. రైతులంతా గులాబీ దండులా కదలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు ఒడితెల సతీశ్‌కుమార్, నన్నపునేని నరేందర్, చంద్రావతి, సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి గ్యాదరి బాలమల్లు, రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, రజనీ సాయిచంద్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా పార్టీ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి రూపొందించిన 'భళే ఎగిసెర భళే ఎగిసెరా... సారే రావాలంటూ ఓరుగల్లు పిలిచెరా' పాట సీడీని కవిత ఆవిష్కరించారు. పాట రచించిన రిటైర్డ్ ఎమ్మార్వో మహమ్మద్ సిరాజుద్దీన్‌ను ఆమె అభినందించారు. భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

### దేశ రాజకీయాలను ప్రభావితం చేసే సభ

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

ఎల్కతుర్తి, ఏప్రిల్ 24: బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 వసంతాలు కావొస్తున్న సందర్భంగా ఎల్కతుర్తిలో నిర్వహించబోయే రజతోత్సవ సభ రాష్ట్రంలోనే కాదు, దేశ రాజకీయాలను సైతం ప్రభావితం చేసేదిగా ఉంటుందని మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. గురువారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో సభా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. వరంగల్ పోలీసు కమిషనర్ సభ ఏర్పాట్లు చూసేందుకు రాగా, ఆయనతో పోలీసు బందోబస్తుకు సంబంధించిన ఏర్పాట్లపై మాట్లాడారు. సభాస్థలికి రావడం మొదలు ఇంటికి వెళ్లేదాకా కంటికి రెప్పలా కార్యకర్తలను కాపాడుకుంటామని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. కంట్రోల్ రూము నుంచి సీసీ కెమెరాలతో ట్రాఫిక్, సభాస్థలిని పర్యవేక్షిస్తామన్నారు.

## రేవంత్ గోబ్యాక్.. కేసీఆర్ కమ్‌బ్యాక్

**తెలంగాణ సకల జనాభిప్రాయమిదే**
**ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి**



ఖలీల్‌వాడి, ఏప్రిల్ 24: రేవంత్ గోబ్యాక్.. కేసీఆర్ కమ్ బ్యాక్ అన్నదే సకలజనాభిప్రాయమని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో జీవన్‌రెడ్డి పార్టీ నేతలతో రజతోత్సవ సభపై సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్ హయాంలో అభివృద్ధి, సంక్షేమం మూసీలో కలిసిపోయి ప్రతి ఇంట్లో సంక్షోభం, ప్రతి కంట్లో విషాదం కనిపిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రుణమాఫీ, రైతు భరోసా, కల్యాణలక్ష్మి, కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టులు, 24 గంటల కరెంట్, ఇంటింటికీ మిషన్ భగీరథనీళ్లు, మెరుగైన వైద్యం, సర్కారు విద్యా సంస్థలలో సౌకర్యాలు, ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో ఉద్యోగ అవకాశాలు, పెన్షన్లు కావాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

### 'హలో విద్యార్థి-చలో వరంగల్' పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా యూనివర్సిటీలో 'హలో విద్యార్థి-చలో వరంగల్' అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను గురువారం బీఆర్ఎస్‌వీ ఉపాధ్యక్షుడు తుంగబాలు ఆవిష్కరించారు. ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ సభకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఇచ్చిన మాట సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ తుంగలో తొక్కిందని తుంగబాలు ఆగ్రహం వ్యక్తంచేశారు.

## చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణభవన్‌లో కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో రూపొందించిన చలో వరంగల్ పోస్టర్‌ను గురువారం ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి, బీసీ కమిషన్ మాజీ మెంబర్ కిశోర్‌గౌడ్, ఫయాజ్, సేవాదళ్ అధ్యక్షుడు అమీర్‌అలీ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్ రమణ మాట్లాడారు. పార్టీ నాయకులు, సబ్బండవర్గాలు తరలివచ్చి బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రమణ, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పల్లె రవి



రాయపర్తిలోఎడ్లబండిని తోలుకుంటూ వస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

## రైతుల బాధలు తెలిపేందుకే ఎడ్లబండ్ల ర్యాలీ

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

రాయపర్తి, ఏప్రిల్ 24 : కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న బాధలను సబ్బండ వర్ణాల దృష్టికి తీసుకు రావాలనే తలంపుతోనే సూర్యాపేట జిల్లా నెమ్మికల్ నుంచి 16 ఎండ్లబండ్లతో అన్నదాతలు బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలి వస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. గురువారం ఉదయం వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రానికి చేరుకున్న ఎడ్లబండ్ల ర్యాలీకి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వయంగా ఎడ్లబండిని నడుపుతూ వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి మీదుగా బీఆర్ఎస్ మండల కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రజతోత్సవ సభకు గులాబీ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు, ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు.

# కేసీఆర్ కోసం ప్రజల ఎదురు చూపు

- ఆయన కోసం సభకు భారీగా తరలివస్తరు
- 27న జరిగే బీఆర్ఎస్ సభ సక్సెస్ అవుతది
- కంచ గచ్చిబౌలి భూముల విషయంలో స్మితా సబర్వాల్ చేసిన ట్వీట్‌లో తప్పేమీ లేదు
- ఎమ్మెల్యే దానం వ్యాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 24(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ సభ సక్సెస్ అవుతుందని, ఈ సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివస్తారని చెప్పారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'కేసీఆర్‌ను చూడాలని ప్రజలంతా ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నరు. ఆయన ఈ సభకు వస్తున్నారు కాబట్టి ఆయనను చూసేందుకు జనాలు పెద్ద సంఖ్యలోనే వస్తరని నేను భావిస్తున్న. కేసీఆర్ సభ సక్సెస్ అవుతదని అనుకుంటున్న' అని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే బీఆర్ఎస్ సభపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపై రాజకీయవర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. కేసీఆర్ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి.

### వాస్తవాన్నే రీట్వీట్ చేసింద్రు

కంచ గచ్చిబౌలి భూముల వివాదంలో ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌కు నోటీసులు ఇవ్వడంపైనా దానం తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇందులో స్మితా సబర్వాల్ తప్పేమీ లేదని, అక్కడ జరిగిన వాస్తవాన్నే రీట్వీట్ చేశారని తెలిపారు. సుప్రీంకోర్టు కూడా సీఎస్ శాంతికుమారిని హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు. సీఎస్ శాంతికుమారికి తన సర్వీస్‌లో ఎలాంటి చెడ్డపేరూ లేదని, ఒక్క మచ్చలేకుండా సర్వీస్ అందించారని చెప్పారు. అలాంటి ఆమె ఇప్పుడు గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టుతో తిట్లు తినాల్సి వచ్చిందని వాపోయారు. ఒక మంచి అధికారికి ఇలాంటి చికాకులు రావడం బాధాకరమని చెప్పారు. స్మితా సబర్వాల్ కూడా నిజాయితీగల అధికారి అని, వాస్తవాన్నే ఆమె రీట్వీట్ చేశారని, ప్రభుత్వాన్ని ఉద్దేశపూర్వకంగా బద్నాం చేశారని తాను భావించడం లేదని చెప్పారు.



భద్రాద్రి జిల్లా ఇల్లెందులో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, ఉద్యమ నేత దిండిగాల రాజేందర్

## ఇల్లెందు నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్దాం

**రజతోత్సవ సభను జయప్రదం చేద్దాం**
**రజతోత్సవ బైక్ ర్యాలీలో హరిప్రియ, దిండిగాల**

ఇల్లెందు, ఏప్రిల్ 24: బీఆర్ఎస్ ఆవిర్భవించి పాతికేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు ఇల్లెందు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్దామని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, ఉద్యమ నేత దిండిగాల రాజేందర్ పిలుపునిచ్చారు. రజతోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరుతూ పార్టీ శ్రేణులతో కలిసి ఇల్లెందు పట్టణంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసమే ఆవిర్భవించిన బీఆర్ఎస్.. సుదీర్ఘ ఉద్యమంతో స్వరాష్ట్ర కలను సాకారం చేసిందని గుర్తుచేశారు.

IHMI
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ & అప్లైడ్ న్యూట్రిషన్
(పర్యాటక మంత్రిత్వ శాఖ కింద స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ, GOI)
F-Row, D.D. Colony, Vidyanagar, Hyd-500007 (T.G.) Ph: 040-2742 7569, Mob: 8374787988
e-mail: ihmhyd.principal@gmail.com; Website: www.ihmhyd.org
స్టార్ హోటల్స్/హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలకు యూనిఫాంల (కనీస పరిమాణం - 250 నంబర్లు) సరఫరాలో కనీసం 3 సంవత్సరాల అనుభవంతో ఆసక్తి గల సరఫరాదారులు మమ్మల్ని సంప్రదించవచ్చు లేదా యూనిఫాంల జాబితా కోసం మా వెబ్‌సైట్‌ను దర్శించండి.
కొటేషన్ దాఖలు కొరకు ఆఖరి తేది: 15.05.2025
ప్రతి ఐటం యొక్క నమూనాతో
సం/- ప్రిన్సిపాల్/మెంబర్ సెక్రటరీ